(సీరియల్ కథ)

# సుడిగాలిలో...... దీపం!



★

రచన :

* శ్రీ బుద్ధిరాజు నరసింహారావు *

(గతసంచిక తరువాయి)

"ముఖ్యంగా అను నేను మాత్రం ఈ బాబాల చమత్కారాల్ని నమ్మను. ఈ విషయంలో నాకు కాస్త అనుభవంకూడా వుంది. మానవులు మూఢ నమ్మకాలతో నిండివున్నారు. అందుకే వారిని ఆధారంగా తీసుకుని భగవానుని అవతారంగా నటించి భయపెట్టి దోచుకుంటున్నారు"

సుందరం ఇంకేదో అనేలోపల దీప టిఫినూ, కాఫీ తీసుకువచ్చింది. "నమస్కారం బాబాయి!"

"వెయ్యేళ్ళు వర్ధిల్లమ్మా, అమ్మాయి అత్తారింటికి వెళ్ళడానికి సిద్ధంగా వున్నావా?"

"పొండి బాబాయి మీరు మరీను" సిగ్గుతో తలదించుకుని వారికి టిఫినూ కాఫీ అందించి దీప లోపలికి పారిపోయింది.

టిఫినూ కాఫీ పూర్తయ్యాక సుందరం అన్నాడు, "అయితే నీ నిర్ణయమేమిటి?"

"ఇంకో అబ్బాయిని..."

"మరోసారి చెప్తున్నాను చంద్రం, మూర్ఖంగా ప్రవర్తించకు. కమల్‌తో పెళ్ళయ్యాక దీప దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుంది. నామాట కాదనకు. చూడు ఆ అబ్బాయికి కట్నాలు వద్దు కానుకలూ అక్కర్లేదు. నిరాడంబరంగా పెళ్ళిచేసుకుంటానంటున్నాడు. అంతకన్నా నీకేంకావాలి? నా మాట విని ఆ మూడు ముళ్ళూ వేయించి పుణ్యంకట్టుకో"

"కానీ..."

"కానీలేదు గీనీలేదు, ఆమె జీవితం సుఖంగా గడిచేకంటే మనకేం కావాలి? ఆమెని ఓ ఇంటి దానిగా చేయడమే నీ ధర్మంకూడా!"

"ఏమో బాబు నాకేం అర్థం కావటంలేదు."

♦ ♦ ♦

ఆ రెండో రోజు తెల్లారుఝామునే చంద్రయ్య తనిద్దరి కుమార్తెలను నిద్రలోంచి లేపాడు.

దీపా, పుష్ప దిగ్భ్రాంతి చెందారు. తండ్రి వారిని అంత తెల్లారుఝామునే ఎందుకు లేపాడో అర్థం కాలేదు.

"దీపా, పుష్పా త్వరగా తెమలండి మనం ఇప్పుడే ధ్యానపురానికి వెళ్ళాలి స్నానాలు కూడా పూర్తి చేయండి త్వరగా"

"నాన్నా, ఏమైనా పనుందా?" పుష్ప ప్రశ్నించింది.

"అవును అక్కడ బాబా భోలేనాథుడున్నారు కదా? ఆయన ఆశీర్వచనం పొందాలి. ఆయన చాలా కాలం వరకూ హిమాలయాలకి వెళ్ళి నిన్ననే తిరిగి వచ్చారుట.

దీప మౌనందాల్చింది. కాని పుష్ప సంతోషంగా, "అబ్బ...భగవాన్ భోలేనాథ్ తిరిగి వచ్చారా? ఎన్ని రోజులో అయింది ఆయన దర్శనం పొంది. నిజంగా నాన్నా; ఆయన సన్నిధిలో ఆయన ఆలయంలో ఎంతో హాయిగా వుంటుంది. భక్తుల ముందు ఆసనం వేసుకుని కూర్చుని ఆయన భగవద్గీత వినిపిస్తూ వుంటే ఎంత ముచ్చటగా వుంటుంది."

"అది సరేగాని మీరు త్వరగా తయారవ్వండి... అన్నట్లు మన పెరట్లో పూలు తెంపి సజ్జలో పెట్టుకో"

"అలాగే"

మరో అరగంటకల్లా వారు ముగ్గురూ జట్కాలో ధ్యానపురం వేపు బయల్దేరారు.

ధ్యానపురం చేరుకునే సరికి సరిగ్గా గంటన్నర పట్టింది.

అప్పటికే ఎంతో మంది భక్తులతో, శిష్యులతో ఆ ప్రదేశమంతా కిటకిట లాడి పోతోంది

"బాబా భోలేనాథ్ కీ జయ్..."

"భగవాన్ భోలేనాథ్ కీ జయ్..."

ఎటు చూసినా దిశలు దద్దరిల్లేలా ధ్వనిస్తున్నాయి.

జట్కా వానికి డబ్బులిచ్చి చంద్రయ్య దీప, పుష్ప ఆలయం ప్రకనేవున్న బాబాజీ నివాసస్థానానికి అడుగులేసారు.

ఆ భవనం ముందు గదిలో బాబాజీ శ్వేత వస్త్రాలు ధరించి ఆసనం మీద పద్మాసనం వేసుకుని కూర్చుని, కళ్ళుమూసుకుని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

ఆయన చుట్టూ అయిదుగురు అందమైన యువతులు కాషాయి వస్త్రాలలో బాబాజీకి నమస్కరిస్తూ కూర్చుని వున్నారు.

బాబాజీకి ఎదురుగా చంద్రయ్య చేతులు కట్టుకుని క్రింద కూర్చున్నాడు.

దీప, పుష్పకూడా తండ్రి ప్రక్కనే చతికిల బడ్డారు. తండ్రి ఆరోజు ఎందుకంత గంభీరంగా వున్నాడో ఎంత ఆలోచించినా దీపకు అంతు పట్టడం లేదు.

ఎంతసేపటికో బాబాజీ ధ్యాన భంగమయినది. కళ్ళు విప్పగానే ఎదురుగా చంద్రయ్య ఆయనకు కనబడ్డాడు. ఆయన నుదురుపై ముడతపడింది, కళ్ళు వింతలా త్రిప్పుతూ "ఓం ... తెలిసింది ... అంతా తెలిసింది ... శ్రీరామం చంద్రా...అపశకునం...మహాపాపం... రక్షించు .. ఈ

LPC



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువుగా అతిప్రెశర్ లో సాదారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

$\frac{3}{4}$ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

——————— : వివరములకు : ———————

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works ; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002

అమాయకుడిని రక్షించు...” గొణిగాడు బాబా.

అదిరిపడి చంద్రయ్య బాబా కాళ్ళపై బడ్డాడు, “రక్షించండి ప్రభో... నా వల్ల ఏమైనా పొరపాటు జరిగిందా స్వామీ ?”

“లేదు నరుడా...”

“అయితే నా సమస్యకు పరిష్కారం”

“నరుడా ఈలోకంలో వున్న ప్రతిజీవుని సమస్యలూ నాకు తెలుసు. అయినా నీ నోటవెంట వినాలని వుంది. చెప్పు త్వరగా”

“బాబా... ఈమె నా కుమార్తె దీప చిన్న కుమార్తె పువ్వు”

“అలాగా ?” బాబా ఆ ఇద్దరినీ తిలకించి చూసాడు.

“పువ్వు సవతి తల్లితో పుట్టినది. దీప పుట్టగానే నా మొదటి భార్య...”

“శ్రీరామచంద్రా తెల్లారుఝామునే ఈ పిల్ల దర్శనం ఈసాధువుకి ఘోర అపశకునం కాదా...”

దీప ఉలిక్కిపడింది. పువ్వుకి కూడా ఏమీ అర్థం కాలేదు.

చంద్రయ్య మెల్లిగా “దీపకి పెళ్ళి నిశ్చయమయినది. ఆ యువకుడు చూడడానికి బాగానే వుంటాడు గాని అతను ఆధునిక సంస్కారాలలో పుట్టి పెరిగాడుట అందుకే పెళ్ళి చేసుకుంటే రిజిస్ట్రార్ ఆఫీసులోనే అంటాడు మన రీతి ప్రకారంగా చేసుకోడుట. నేనేం చేయను బాబా నాకు మార్గమేది ?”

“శ్రీరామచంద్రా ఆ పాపాత్ముడికి నరకంలో కూడా స్థానం దొరకదు. చూడు నరుడా ఈ వివాహం చేయక పోతేనే మంచిది”

“ఏం బాబా ?”

చంద్రయ్య వెంటనే దీప జాతకం జేబులోంచి తీసి బాబాకి అందించాడు.

బాబా కొద్దిక్షణాలు దీర్ఘంగా ఆ జాతకాన్ని చూసాడు. దీప, పువ్వు బాబా మొకం తదేకంగా నిరీక్షిస్తున్నారు.

బాబా చుట్టూ గుమిగూడివున్న శిష్యరాళ్ళు కూడా బాబానే తదేకంగా చూస్తున్నారు.

బాబా వేళ్ళమీద ఏదో లెక్కపెడుతూ, చూడు నరుడా ఈ అమ్మాయి జన్మించిన చక్రం సప్తమ స్థానంలో సూర్యుడూ శని నివశిస్తున్నారు. పెళ్ళయితే ఈ అమ్మాయి విధవయిపోతుంది.

“ఏమిటీ ?” చంద్రయ్య అదిరిపడ్డాడు.

దీపకి కళ్ళు తిరుగుతున్నట్లయింది.

పువ్వు వుండలేక, “ఏమిటి బాబా మీరనేది అక్కయ్యని ఈ గండం నుండి రక్షించే మార్గంలేదా ?”

“మార్గమా ? తప్పకుండా వుంది పూర్వీకులే కదా ఆ మార్గాలు నిశ్చయించింది మహా శాంతి చేయించాలి, మహా యజ్ఞం చేయించాలి. ఏం నరుడా మాట్లాడవేం. మహా యజ్ఞం చేయించ గలవా ?”

“ఆజ్ఞాపించండి బాబా” చంద్రయ్య స్వరం వణికింది.

“యజ్ఞానికై యాభై ఒక్క డబ్బాల మంచి నెయ్యి, ఇరవై ఒక్క డబ్బాల పిండి, కమలపూలు. చందనం, వస్త్రం, బంగారం మొదలగునవన్నీ కావాలి. అంతేకాదు పాతిక మంది బ్రాహ్మణులకు భోజనాలు పెట్టాలి, శనిని శాంతించడానికి ఇరవైమూడు వేల జపాలు చేయాలి. అప్పుడే విముక్తి !”

బాబా చెప్తూవుంటే చంద్రయ్య నీరుకారిపోతూడు. ఎంతలేదన్నా ఏదారు వేల రూపాయల ఖర్చుకి తక్కువ వుండదు.

“నరుడా వచ్చే పదవ తారీకుని మహా యజ్ఞానికి మంచి ముహూర్తముంది. నీవు కోరుకుంటే నేనే స్వయంగా ఆ యజ్ఞాన్ని జరిపిస్తాను పో ఇక పో శ్రీరామచంద్రా” బాబా తిరిగి కళ్ళు మూసుకున్నాడు

ముగ్గురూ లేచి భారంగా బయటకు వచ్చారు.

జట్కాలో తిరిగి వస్తూవుంటే దీప తండ్రితో, “నాన్నా నాకీ పెళ్ళొద్దు నాకేదైనా ఉద్యోగ మిప్పించండి”

“నోరుమూసుకుని కూర్చుంటావా లేదా ?” చంద్రయ్య గర్జించాడు.

దీప కళ్ళవెంట గిర్రున నీరు తిరిగింది. తండ్రి వాక్యం శూలంలా ఆమె హృదయంలో గుచ్చుకుంది.

పువ్వు అక్కయ్యతో ఏదో అనబోతే కూడా చంద్రయ్య కొప్పడ్డాడు.

* * *

“టక్ టక్ టక్ !” బయటగొళ్ళెం శబ్దంమయింది,

దీప ఉలిక్కిపడింది.

"అరే ఇంతసేపు తనింకా నిద్రపోతూనే వుంది అనుకుని దీప పరుపు మీద నుండి లేచింది. ఎదురుగా టేబిలు మీద వున్న వాచీలో టైం చూసుకుంది తొమ్మిదయింది.

రాత్రల్లా ఆమె సరిగ్గా నిదురపోలేదు. గత చరిత్ర ఆలోచనలు ఆమెను రాత్రల్లా వేధించి బాధ పెడుతూనే వున్నాయి. కొద్దిసేపు పూర్వమే కాస్త కునుకు పట్టింది. అంతలోనే తలుపు శబ్దంతో మేలుకువ వచ్చేసింది.

ఆమె బద్ధకంగా వొళ్ళువిరుచుకుని పైట కొంగును సరిచేసుకుంది.

బద్దకంగా అడుగువేసుకుంటూ వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా పాలవాడు, "అమ్మగారూ ఏటండీ ఈ రోజు ఇంతా లేటయిపోయింది, ' మీరేమో స్కూలుకి వెళ్ళిపోయారేమో నని నేననుకున్నాను.

"అవును పైడయ్యా ఈ రోజు లేవడమే ఆలస్యమైపోయింది." అంటూ వంటింటిలోకి వెళ్ళి పాలగిన్నె తీసుకువచ్చి పాలు పోయించుకుంది,

పాలవాడు వెళ్ళిపోయాక తలుపువేసి దీప హడావిడిగా నిత్యకృత్యాలలో లీనమై పోయింది.

ఆమె స్కూలుకి చేరేటప్పడికి పావు తక్కువ పది కొండయి పోయింది.

స్కూలు ప్రిన్సిపాల్ ఆమెని చూసి చిరునవ్వు నవ్వుతూ, "మీరు లేటుగా రావడం ఇదే మొదటి సారి అనుకుంటా!" అన్నాడు.

"ఈ రోజు లేవడమే లేటయింది సార్"

"మీరు రాత్రల్లా సరిగ్గా నిదురపోలేనట్లు మీ కళ్ళు చెబుతున్నాయి. ఏం? ఏమైనా ట్రబులా! మేవి హెల్ప్ఏమి?"

"ఎక్స్క్యూజ్ మి సర్ నాలో చెలరేగుతున్న సమస్యలకు పరిష్కారమే లేదు సారీ మీకు చెప్పలేను"

"లెట్ ఇట్ బి ఇదిగో కొన్ని లెటర్స్ వున్నాయి, వీటితోనే బోర్డ్‌కి వెళ్ళబోయే కొన్ని ఫారంలు కూడా వున్నాయి. ఇవి టైపు చేసి పోస్ట్ చేయించండి. ఇంకేమన్నా ట్రబుల్ అయితే మిస్టర్ జహాంగీర్‌ని కంసల్ట్ చేయండి! నేను ఓ మీటింగ్‌కి వెళ్ళాలి"

"ఓ కే సర్"

ప్రిన్సిపాల్ వెళ్ళిపోయాడు.

దీప టైపురైటర్ ముందు కూర్చుంది.

ఆ రోజు ఏ పని చేయడానికి ఆమె మనసు అంగీకరించడంలేదు. కాని ప్రిన్సిపాల్ అప్పజెప్పిన కార్యం పూర్తి చేయాలి కదా?

ఆమె ఆ లెటర్స్‌ని టైపు చేయడం ప్రారంభించింది.

* * *

అప్పుడే ఏదో పనిమీద ఆ రూంలోకి వచ్చిన రజనీ కాంత్ దీపని చూసీ చూడ నట్లు టేబిలు మీద వున్న పుస్తకాన్ని తీసుకుని ఏమీ మాట్లాడకుండా బయటకు వెళ్ళి పోయాడు.

దీప అతనేమైనా మాట్లాడతాడేమో అనుకుంది కాని ఆమె ఆశ నిరాశ జెందింది. హృదయంలో ఏదో గుచ్చుకున్నట్లు బాధపడింది.

కన్నీటితో నిండిన కళ్ళముందు మరీ గత చరిత్ర చిత్రాలు ప్రత్యక్షమవ సాగాయి.

* * *

"చూడు చంద్రం నీకు నేను ఎన్నోసార్లు చెప్పాను. అర్థం పర్థంలేని ఈ ఆచారాలూ, జాతకాలు నేను నమ్మను. నువ్వుకూడా ఈ మూఢ నమ్మకాలను వదులు ఈ బాబా, సాధువుల మాటలను నమ్మకు. దీప కమల్ వివాహామవనీ!" సుందర్ నచ్చజెప్తూ అన్నాడు.

"బాబా మాటల కాదన్నా ఏదైనా ఎదురైతే?" చంద్రయ్య భయపడుతూ అన్నాడు.

ఎల్లప్పుడూ...

"ఎమరాల్డ్" బనియన్లనే ఉపయోగించండి.




26, Stanes Rd., 4th St.,
TIRUPUR - 638602

Regd. No. 300188

“ఏమీ అవదు. కొన్ని కొన్ని పరిస్థితులలా ఏర్పడి వారిని నమ్మేలా చేస్తాయి. అకస్మాత్తుగా అలాంటి సంఘటనలు జరిగిపోతాయనుకో, వాటినే ఆధారంగా తీసుకుని గుడ్డిగా నమ్మడం మూర్ఖత్వమే. కాస్త శాంతంగా ఆలోచించు, అంత నెయ్యి, ఇతర సామాన్లూ పోట్టినే వస్తాయా? మనం గుడ్డిగా నమ్మ బట్టే ఈ సాధువులు మననిలా దోచుకుంటున్నారు. హు! మంచినెయ్యి... పాపం బీదవాళ్ళు ఎప్పుడూ పొందలేని మంచి నెయ్యి మూఢ నమ్మకాల ద్వారా అగ్నిలో ఆహుతి అవుతున్నది.’.

“అంత మాటని ఎందుకురా సుందరం పాపం కట్టుకుంటావు?”

“ఉన్న సత్యాన్ని చెప్పడంలో నేను పాపాత్ముడినయినా పర్వాలేదు. ఒరే చంద్రం మనం పోయాక మనం మూట గట్టుకున్న పుణ్యాన్ని బట్టి మనకు స్వర్గమే దొరుకుంతుదని గ్యారంటీ ఏమిటి? మనకన్నా ముందు మహాత్ములకి స్వర్గమే దొరికిందని గ్యారంటీ ఏమిటి? అది సరేగాని ఎందుకలే ఈ వాదన మనకి? నేను కమల్ వాళ్ళింటికి వెళ్ళాను. నీ మనసులో బాధ శాంతంగా వారికి బోధపరిచాను. ఎలాగైతేనేం వారు మన పద్ధతిలోనే పెళ్ళి చేయడానికి అంగీకరించారు. కానీ పరిస్థితిగా పైసా నిరాడంబరంగా చేయడానికి ఒప్పుకున్నారు.”

“ఆం... అలాగా... కాని మహాశాంతి”

“అదుగో... అదే వద్దన్నాను. కథ మొదటికి దీసుకురాక. నా మాట విని పెళ్ళి జరిగిపోనీ తర్వాత సంగతి తర్వాత చూసుకోవచ్చు!”

ఎంతసేపో వాద వివాదాలు జరిపి చివరికి ఎలాగో చంద్రయ్య సుందరంతో ఏకీభవించాడు.


ఆ రెండో రోజు చంద్రయ్య ద్వారా ఆ వార్త తెలుసుకున్న బాబా భోలేనాథుడు శాపమిచ్చాడు. ఉద్రేకంతో ఊగిపోతూ, “ఫో... నాశన మైపోతావు నరుడా నువ్వు బ్రాహ్మడినే అవమాన పరిచావు. అంతే కాదు దేవతలని, పంచభూతాల నిర్ణయాన్నే కాదన్నావు ఫో... నాశనమైపో...”

తలదించుకుని చంద్రయ్య తిరిగొచ్చేసాడు.

(సశేషం)

---

“కథాంజలి”లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులుకాదు. —సంపాదకుడు.



అమృతా ఫిలింసువారి వర్ణచిత్రం “చుట్టాలున్నారు - జాగ్రత్త” చిత్రంలో కృష్ణ - శ్రీదేవి.